
మంథని మున్సిపల్ పరిధిలోని వెంకటసాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్

# కేసులు సరే.. చర్యలేవి?

**కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వడంలో మిల్లర్ల మాయాజాలంపై యంత్రాంగం కొరఢా ఝులిపిస్తున్నది. ఇలానే, మంథని మండలంలోని వెంకటసాయి, మారుతి మిల్లులపై దాదాపు నెల క్రితం కేసులు నమోదు చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత చర్యలు ఆలస్యమవుతుండడం తప్పడు సంకేతాలనిస్తున్నది. గతంలో ఇలాంటి సమయంలోనే కొందరు రెవెన్యూ రికవరీ చట్టం నుంచి తప్పించుకునేందుకు అడ్డదారులు తొక్కారనే విమర్శలున్నాయి. అప్పుడు తమ పేరు మీద ఉన్న ఆస్తులను గుట్టుగా ఇతరుల పేరు మీదకు మార్చి కాపాడుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, అక్రమాలకు పాల్పడిన వారంతా భవిష్యత్తులో ఇదేబాటలో నడిచే ప్రమాదం కనిపిస్తుండగా.. అధికారులు వెనువెంటే చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

- సీఎంఆర్ పేరిట రూ.కోట్లు మింగిన మిల్లర్లు
- నెల క్రితం వెంకటసాయి, మారుతి మిల్లులపై కేసులు
- విచారణ ఆలస్యంపై విమర్శలు
- మిగతా మిల్లర్లకు తప్పుడు సంకేతాలు
- గతంలో రెవెన్యూ రికవరీ చట్టాలకు దొరక్కుండా కొందరు అడ్డదారులు
- ఆస్తులను ఇతరుల పేరు మీదకు మళ్లించారనే ఆరోపణలు


మారుతి రైస్ మిల్

పెద్దపల్లి, మార్చి 25(నమస్తే తెలంగాణ): రైతుకు మద్దతు ధర ఇస్తూ ప్రభుత్వరంగ సంస్థల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొంటున్నది. సదరు ధాన్యాన్ని పైసా పెట్టుబడి లేకుండా కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పేరిట మిల్లర్లకు అందిస్తున్నది. రా రైస్ మిల్లర్లు అయితే క్వింటాల్ ధాన్యానికి 67 కిలోలు, అదే బాయిల్డ్ మిల్లర్లయితే 68 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. సీఎంఆర్ తీసుకున్నాక మూడు నెలల్లో బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి అప్పగించాలి. యాసంగిలో వచ్చిన ధాన్యాన్ని వానకాలం వరకు, వానకాలంలో వచ్చిన ధాన్యాన్ని యాసంగి వరకు బియ్యంగా మార్చి ఇవ్వాలి. కానీ, తిరిగి బియ్యం ఇవ్వడంలో చాలా వరకు మిల్లర్ల మాయాజాలం కనిపిస్తున్నది. 2022-23 యాసంగికి సంబంధించి పెద్దపల్లి జిల్లాలో 43 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తి కాగా, 2023-24 వానకాలంలో అయితే, కేవలం 2 శాతమే పూర్తి కావడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. పదే పదే గడువు పొడిగిస్తున్నా.. బియ్యం ఇవ్వడంలో నిర్లక్ష్యం కనిపిస్తున్నది. చర్యలు లేకపోవడంతో కొంతమంది అక్రమాలకు తెరలేపి, ప్రభుత్వం ఇచ్చిన వడ్లకే ఎసరు పెట్టి రూ.కోట్లు దండుకున్నట్లు తెలుస్తున్నది. బియ్యం కంటే ధాన్యం అమ్మితేనే ఎక్కువ అక్రమార్జన వస్తుందని భావించి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు అక్రమంగా ధాన్యాన్ని తరలించి విక్రయించినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే పలు చోట్ల రూ.కోట్ల విలువైన ధాన్యాన్ని అమ్ముకున్నట్లు అధికారుల తనిఖీల్లో బహిర్గతమైంది.

### చర్యలు అంతంతే..

ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించని రైస్ మిల్లులపై అధికారులు కొరడా ఝులిపించడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే 2022-23 వానకాలం సీజన్‌కు మంథని మండలం కూచిరాజ్‌పల్లిలోని వెంకటసాయి రైస్‌మిల్లు ₹8.50 కోట్లు, మారుతి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు ₹21.64 కోట్ల విలువైన ధాన్యం ఇవ్వకుండా ప్రభుత్వానికి నష్టం కలిగించినట్టు గుర్తించారు. గత నెల 29న కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు మంథని ఠాణాలో కేసులు నమోదు చేశారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం నిందితుల ఆస్తులు జప్తు చేసి వేలం వేసి ప్రభుత్వ నష్టాన్ని భర్తీ చేస్తామని అప్పుడు అధికారులు స్పష్టం చేశారు. కానీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గతంలో సుల్తానాబాద్ మండలంలోని చీకురాయిలోని ఓ రైస్ మిల్లుపై క్రిమినల్ కేసులు నమోదైనా.. అప్పుడు విచారణ అంతంత మాత్రంగానే సాగిందన్న విమర్శలున్నాయి.

### తప్పించుకునేందుకు అడ్డదారులు

అడ్డదారులు తొక్కుతున్న మిల్లర్లపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత వెనువెంటే చర్యలు లేకపోవడం మిల్లర్లకు కలిసివస్తున్నది. కొన్నిసార్లు విచారణ ఆలస్యంగా జరుగుతుండగా, రెవెన్యూ రికవరీ చట్టానికి దొరక్కుండా ఉండేందుకు అడ్డదారులు తొక్కుతున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో నిందితులు తమ పేరు మీద ఉన్న ఆస్తులను జప్తు చేయకుండా ఉండేందుకు గుట్టుగా బంధువుల పేరు మీదకు మళ్లిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలానే, గతంలో మంథని మండలంలోని ఓ రైస్ మిల్లర్‌పై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించేందుకు ప్రయత్నించగా, అప్పుడు ఆయన పేరు మీద ఉన్న ఆస్తులన్నీ కుటుంబ సభ్యుల పేరుపైకి మార్చినట్లు తెలిసింది. దీంతో రికవరీ సాధ్యపడలేదు. 25 రోజుల క్రితం కేసులు నమోదైన వెంకటసాయి, మారుతి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులకు సంబంధించిన విషయంలో ఇప్పటి వరకు చర్యలు లేకపోగా, వారి ఆస్తుల విలువ బకాయిపడ్డ సీఎంఆర్‌కు చాలా తక్కువ ఉన్నట్టు తెలిసింది. ఒకవేళ రికవరీ చట్టాన్ని ప్రయోగించినా ప్రభుత్వానికే నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో బకాయిలు ఎలా రికవరీ చేస్తారనే ప్రశ్న అందరిలో వ్యక్తమవుతున్నది. దీనిపై మిల్లర్లలో జోరుగా చర్చ సాగుతుండగా.. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించే అక్రమార్కులపై చర్యలు ఆలస్యమైనా.. లేకపోయినా భవిష్యత్తులో మరికొంత మంది ఇదే దారిలో పయనించే ప్రమాదం ఉన్నది. కేసులు నమోదు చేయడమే కాదు.. వేగంగా చర్యలు తీసుకుంటేనే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయం ప్రతి ఒక్కరిలోనూ వ్యక్తమవుతున్నది.

### ఎంతటి వారైనా చర్యలు తప్పవు



ప్రభుత్వ సొమ్మును అక్రమంగా ఎవరు కాజేసినా బాధ్యులపై చర్యలు తప్పవు. పెద్దపల్లి జిల్లాలో జరిగిన సీఎంఆర్ అక్రమాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. భవిష్యత్తులో ఏ మిల్లర్ కూడా ఇలా మోసం చేయకుండా చర్యలు తీసుకోనున్నాం. ఇప్పటికే సీఎంఆర్ బియ్యం ఇవ్వని మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాం. వారి ఆస్తుల వెరిఫికేషన్ జరుగుతున్నది. పూర్తిస్థాయి చర్యలకు రెండు నెలల సమయం పట్టవచ్చు. ఈ విషయమై రామగుండం పోలీసు కమిషనర్‌తో ప్రత్యేకంగా మాట్లాడాం. ప్రభుత్వ తదుపరి ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకుంటాం. అవసరమైతే అరెస్టులు కూడా చేసే అవకాశం ఉంది. రైస్ మిల్లర్లు మోసం చేయకుండా అన్ని రకాల చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరక్కుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

**- ముజామ్మిల్‌ఖాన్, పెద్దపల్లి కలెక్టర్**

# కొండగట్టు ఆలయ ఈవోగా చంద్రశేఖర్

మల్యాల(కొడిమ్యాల), మార్చి 25 : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ ఈవోగా దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో అంజయ్య, ఇతర అధికారులు, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, గతంలో ఈవోగా పని చేసిన టంకశాల వెంకటేశం సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.


బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

# రేపు కరీంనగర్‌లో మెగా ఉద్యోగ మేళా

కమాన్‌చౌరస్తా, మార్చి 25 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న బుధవారం 15కు పైగా సంస్థలతో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ శ్రీలక్ష్మి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శోభారాణి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 2021 నుంచి 2024 వరకు పీజీ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు రెస్యూం, సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 99120 93500లో సంప్రదించాలని చెప్పారు.


ఫర్టిలైజర్‌సిటీ: నృత్యం చేస్తున్న రామగుండం సీపీ శ్రీనివాసులు


జగిత్యాల కలెక్టరేట్: రంగులు చల్లుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్


రంగులు చల్లుకుంటున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు


సిరిసిల్ల రూరల్: పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నృత్యం చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్




జగిత్యాల: ఎమ్మెల్యే సంజయ్‌కు రంగులు పూస్తున్న యువకులు

# 'కలర్' ఫుల్ జోష్

## ఉమ్మడి జిల్లాలో హోలీ హంగామా


కరీంనగర్: వేడుకల్లో యువతుల నృత్యం


కరీంనగర్: వేడుకల్లో చిన్నారులు


సిరిసిల్లలో..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సోమవారం హోలీ సంబురం అంబరాన్నంటింది. ఎక్కడ చూసినా యువత కేరింతలతో సందడి కనిపించింది. యువతీ యువకులు ఉదయాన్నే కలర్ డబ్బాలతో బైక్‌లపై తిరుగుతూ కనిపించారు. ఈలలు వేస్తూ కేరింతలు కొడుతూ జోష్‌లో మునిగితేలారు. ఫ్రెండ్స్ ఇళ్లకు వెళ్లి రంగులు పూసి హంగామా చేశారు. హుషారెత్తించే డీజే పాటల మధ్య డ్యాన్స్‌లతో హోరెత్తించారు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కరీంనగర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఆమె భర్త దీపాంక్ సత్పతి, ఆర్డీవో మహేశ్వర్, మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద మేయర్ వై సునీల్‌రావు, పెద్దపల్లిలో అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, రామగుండంలో సీపీ శ్రీనివాస్, సిరిసిల్లలో ఎస్పీ అఖిల్ మహాజన్ హోలీ సంబురాల్లో మునిగి తేలారు. రంగు నీళ్లల్లో తడిసిముద్దయ్యారు.

**- కమాన్‌చౌరస్తా, మార్చి 25**


సిరిసిల్లలో నృత్యం చేస్తున్న మహిళలు


కరీంనగర్: నృత్యం చేస్తున్న యువతులు


కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌కు రంగులు పూస్తున్న ఉద్యోగులు

# గంజాయి అలవాటు చేసి.. ఆపై లైంగిక దాడి

- ఇద్దరు యువకులతో సహా బాలుడి అరెస్ట్
- ముగ్గురిపై పోక్సో, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసు

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 25 : ప్రేమ పేరిట బాలికను నమ్మించి గంజాయి అలవాటు చేసి లైంగికదాడి చేసిన ఇద్దరు యువకులతోపాటు ఓ బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపినట్లు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి ప్రేమ్‌కుమార్ వాటర్ ప్రూఫింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఐదేళ్ల కిందట ఆ యువకుడికి ఓ బాలిక పరిచయం కాగా, తర్వాత ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ఇది నిజమని నమ్మిన ఆ బాలిక స్నేహం చేసింది. దీనిని ఆసరాగా చేసుకున్న ఆ యువకుడు బలవంతంగా లైంగిక దాడి చేశాడు. తర్వాత గంజాయి అలవాటు చేసి తన ఇంటికి తీసుకెళ్లి పలుసార్లు లైంగికంగా వాడుకున్నాడు. కొంత కాలం తర్వాత ఆమెను దూరంపెట్టాడు. 2022లో ఆ బాలికకు మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్ పరిచయమయ్యాడు. వెంకటేశ్ సైతం ప్రేమిస్తున్నానంటూ బాలికకు గంజాయి ఇస్తూ బలవంతంగా లైంగికంగా వాడుకున్నాడు. ఆ తర్వాత వదిలించుకున్నాడు. ప్రస్తుతం సదరు బాలిక పదో తరగతి మధ్యలోనే ఆపేసి ఇంట్లోనే ఉంటుండగా, ఇదే ప్రాంతంలో నివాసం ఉండే ఓ బాలుడు సైతం ప్రేమిస్తున్నానంటూ బాలికకు దగ్గరయ్యాడు. బాలికకు మత్తుపదార్థాలు ఇచ్చి బాలుడు సైతం లైంగికదాడి చేశాడు. తర్వాత బాలిక ప్రవర్తనలో తేడా రావడాన్ని గమనించిన తండ్రి, బాలికను అడుగగా పై విషయాలు తెలిశాయి. తన కూతురిని గంజాయి, మత్తు పదార్థాలకు బానిస చేసి, లైంగిక దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆ తండ్రి ఈ నెల 23న జగిత్యాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మత్తుపదార్థాల వినియోగం వల్ల బాలిక మానసిక స్థితి సరిగా లేకపోవడంతో డీ అడిక్ట్ సెంటర్‌లో చేర్పించాడు. కాగా, బాలిక తండ్రి, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, డీ అడిక్ట్ సెంటర్ వారి స్టేట్‌మెంట్ ద్వారా ప్రేమ్‌కుమార్, వెంకటేశ్, బాలుడు వేర్వేరుగా ముగ్గురు బాలికకు మత్తుపదార్థాలు అలవాటు చేసి లైంగికంగా వాడుకున్నారని విచారణలో తేలింది. దీంతో ఆ ముగ్గురిని అరెస్ట్ చేశారు. ప్రేమ్‌కుమార్, వెంకటేశ్ నుంచి 140 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై పోక్సో యాక్ట్, ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.



### మీడియా సంయమనం పాటించాలి

**బాధితుల వివరాలు వెల్లడయ్యేలా చేస్తే శిక్ష**

సమస్య సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకొని మీడియా సంయమనాన్ని పాటించాలని సీఐ సూచించారు. ఐపీసీ, పోక్సో, జువెనైల్ చట్టం-2015 ప్రకారం బాధితులకు సంబంధించిన ఐడెంటీని, సంబంధిత వ్యక్తుల వివరాలను ఏ రూపంలోనైనా బహిర్గతం చేస్తే సుప్రీ కోర్టు తీర్పు ప్రకారం శిక్షార్హులవుతారని పేర్కొన్నారు.

# 27, 28 తేదీల్లో పొలాసలో సమావేశం

జగిత్యాల టౌన్, మార్చి 25 : ఈ నెల 27, 28 తేదీల్లో ఉత్తర తెలంగాణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహిస్తున్నట్లు పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని జిల్లా వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ పీ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి పాల్గొని వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని నివారించే దిశగా పరిశోధనలు చేపట్టే విధంగా దిశా నిర్దేశం చేయనున్నారు. గత సంవత్సరం జరిగిన పరిశోధనల ఫలితాలను రైతులకు ప్రజంటేషన్ రూపంలో అందజేయనున్నారు.